వైధవది...రోజు రోజుకు మాసిపోతున్నాయని పన్నాలాల్ గుడ్డల కొట్టులో ప్రత్యేకంగా... అరువు విధానంమీద...అరడజను సిల్కు లాల్చీలు ప్రత్యేక బాణీలో కుట్టించానురా .... అంటూ సంగయ్య చక్కా వచ్చాడు...

ఈసారి ప్రత్యేకత అంటే తెలిసిందిరా... అన్నాడు బావ...ఏం తెలుస్తుంది...వేతనాలు హెచ్చుచేయడం అంటే నాకు అసహ్యంఅంటారు నెహ్రూ ... నిరాడంబర జీవితంలోనే నిజమైన సుఖం ఉందంటారు రాజేంద్రప్రసాద్. ఆధ్యాత్మిక దేశం మనది...అదే మన ప్రత్యేకత అంటూ అమెరికా కెగిరారు ఉపాధ్యక్షులు...పదవిలో ఏ ముందంటారు సంజీవరెడ్డి...అలంకారాలతో పని లేనప్పుడే స్త్రీ సౌందర్యం భాసించేది...అంటూనే మా నాంచారమ్మ బొక్కెడు ఫేసు పౌడరు ఖర్చు పెడుతూంటే....ఔ నసక ఏం అనం.... ఏమైనా సృష్టిలోనే...ఏదో ప్రత్యేకత ఉన్నది... దాన్ని తెలియలేకుండా ఉన్నాం...అని ఊరుకున్నాను. అలా అనుకోవడమే మనలోని ప్రత్యేకత అన్నాడుబావ .వాళ్ళునవ్వితే నాకు ఒళ్ళుమండింది.

"వార్తయందు జగము వర్థిల్లుచుండును!"

# ఊహాచిత్రం: పత్రికా విలేఖరితో

కె. రామలక్ష్మి

ఈ భూమ్మీద పుట్టిపెరిగాక మానవుడు ఉదర పోషణకోసం ఎన్నెనా విద్యలు నేరుస్తాడు. ఎటొచ్చీ యీపద్ధతులు పూర్వంకంటే నేడు అనేక కొత్తవిధాలుగా రూపొందాయి. ప్రస్తుతకాలంలో నెలజీతం రావడానికి, మీ అబ్బాయి కలకటేరు గుమస్తా కానక్కరలేదు. పల్లెటూరి బడిపంతులూ కానక్కరలేదు-పత్రికలకివార్త లందించి-ఆ నెల జీతం సంపాదించవచ్చు. ఇలా అని చెప్తే మా అమ్మమ్మకి ఒకటే ఆశ్చర్యం. అదేమిటే, తెలియదని మరీ చెబుతావు? పత్రికలకి వార్తలు ఒకళ్ళందించే దేమిటే, వాటంతటవే యిస్తాయి వాటిని అన్నీ, పత్రికలకి వార్తలందించేదీ ఓ ఉద్యోగమేనటే అని విస్తుపోయేది. ఔనుమరి! అమ్మమ్మకి పత్రికావిలేఖరి అంటే ఎలా తెలుస్తుంది! యీ నవనాగరిక ప్రపంచంలో పుట్టిపెరిగి, వార్తాపత్రికలే తమ మేధాసంపదకి మూలవిరాట్టుగా ఉన్న యీ కాలపు పిల్లలకి తెలును. పత్రికల వార్తలే పరమ సత్యాలుగా గుర్తించి వాటిపైన వాదోపవాదాలూ, ప్రచండవాగ్యుద్ధాలూ జరిగే రోజులివి. పత్రికావిలేఖరి అంటే నాకు తెలిసినట్టు అమ్మమ్మకి ఎలా తెలుస్తుంది?

పత్రికలు, దిన, వార పక్ష, మాస పత్రికలూ వాటివాటి ప్రత్యేకసంచికలూ కుప్పతిప్పలుగా వచ్చిపడే రోజులివి. అవి అందించే వార్తలూ చాలా వింతపోకడలు పోతున్నాయి. "తోడేలు పిల్లవాడు" దొరికాడనీ, యుద్ధకాలపు వైమానికుడు లలనామణిగా పరిణతి గాంచాడనీ, రాష్ట్ర శాసనసభ చర్చాసందర్భాలో ప్రతిపక్షనాయక వినాయకులు వింతధోరణిలో తిట్టుకున్నారనీ, ఒకటేమిటి—రకరకాలవార్తలను యథాతథంగా ప్రచురించేసి, తరవాత అందినవార్తలవల్ల అవి నిజంకావని తెలిసికొని, "తమ పొరబాటుకి విచారిస్తున్నాం" అని కూడా అనేకసార్లు చూశాను. పత్రికల్లో నే పుట్టకపూర్వం వచ్చిన వింత వింత వార్తలూ విషయాలూ, నాన్నగారు చెప్తూంటే, నేనూ ఎలాగేనా పత్రికా విలేఖరి నవుదామనిపించేది. ఎవరేనా, నలుగురు మాట్లాడుకుంటూంటే వచ్చి ఆత్రంగా ప్రతి అక్షరం జాగ్రత్తగావినే, అమ్మస్నేహితురాలికి "ఫలానా పత్రిక ప్రత్యేక విలేఖరి" అని బిరుదుయిచ్చారు నాన్నగారు. అంతేకాదు-ఎక్కువప్రశ్నలువేసి విసిగిస్తే చాలు. ఖర్మం, విలేఖరివికాని అవుతావేమిటిరా, అని తమ్ముణ్ణి చూసి విసుక్కునేవారు...ఇలా విలేఖరినిగూర్చి విని విని, నాలో అతడంటే ఒక వింత అభిప్రాయం ఏర్పడింది. నా వూహాచిత్రం; పైకి చేప్తే నవ్వేరావచ్చు; కాని అది మాత్రం యిది. కబంధుడిలాగ చేతులు జాపగలిగినంత మేల జాపి వార్తలు

గ్రహిస్తాడనీ, సింహళద్వీపమంతేసి చెవులుండి, ప్రతి చిన్న సవ్వడీ ఆలకించేసి పత్రికలో వేసేస్తాడనీ, నా నమ్మకం. ఈ వూహాచిత్రం పూర్తిగా తప్పు అని మొన్న ఒక పత్రికావిలేఖరిని కళ్లారా చూసినప్పుడు తెలిసింది. ఆ వ్యక్తిని ఇదివరకు చాలాసార్లే చూశాను. కాని పత్రికా విలేఖరి అని మొన్ననే తెలిసింది. అది తెలిసినప్పటి నా ఆశ్చర్యం అంతాయింతా కాదు. నా వూహలన్నీ తప్పని తెలిసేక, ఆ వ్యక్తితో వివరంగా మాట్లాడాలని అనిపించింది. మా యింటికి ఓసారి రండి, మీ వృత్తినిగురించి నాకు కొంచం విపులంగా చెప్పుదురు గాని, అని అర్థించాను. ఫలానా టైము లోనే ఖాళీ వుంటుందనీ, వస్తాననీ చెప్పారు. ఆ ఫలానా టైముకి...చేతిలో కాగితాలూ, చెవిలో పెన్సిలూ, విలేఖరికాక ఇంకెవరు?

నే: రండి విలేఖరీ, మీకోసమే ఎదురు చూస్తున్నాను.

వి: బాగుందండోయ్, అసలు మేమే అందరి కోసమూ వారి మాటలకోసమూ, వేచివుండే పక్షులం. అలాంటిది నాకోసం మీరు వేచి వుండడమేమిటి?

నే: అలా అనకండి, నా జీవితంలో యింతకంటె మంచిరోజు యింకోటిలేదు. మీ పని ఎలా వుంటుందో, మీరు వ్యక్తిగతంగా దాన్ని గురించి ఏమనుకొంటున్నారో తెలుసుకుందామనీ.

వి: సరి, మాదీ, ఓ ఘనకార్యమేనంటారా? యీ వృత్తికి నిర్ణీతకాలమంటూ లేదు. అర్ధరాత్రి అపరాత్రీ మహానుభావు లెవరూ ఉపన్యసించడమూ, శంకుస్థాపనలూ, ప్రారంభోత్సవాలూ చెయ్యడమూలేదు కనక సరిపోయింది కాని, లేకుంటే అప్పుడూ మేం ప్రత్యక్షం కావలసిందే కదా!

నే: మీరలా అంటే జ్ఞాపకం వచ్చింది. మొన్న ఒకవార్త వచ్చింది: “కౌమార యోగికి గడ్డాలు” అని మధ్యరకపు పతాక శీర్షికలో అందించింది మీ పత్రిక. మీరేనా ఆ విలేఖరి?

వి: అవునండి. ఇప్పుడాసంగతంతా చెప్పడానికి పెద్దకథవుతుంది.

నే: ఫరవాలేదు చెప్పండి. అదీ మీ బాధ్యతా నిర్వహణలో ఒకభాగమే కదూ?

వి: అవునండీ, రాత్రి రెండున్నరప్రాంతాన్ని కాని ఆ కౌమారస్వామి ఆశ్రయంలో అలికిడి వుండదు. ఆ టైముకి నే అక్కడ వుంటేనే స్వామిని దగ్గగా చూడవచ్చు. బాగా తెల్లారి పోతే భక్తులు తండోపతండాలుగా చుట్టుముట్టేస్తారు. రాత్రి పదకొండింటికి వుంది ఒక లోకల్ ట్రైన్. దానిమీద ప్రయాణం మూడవ తరగతి పెట్టేమో, కూర్చుందుకే నించుందుకికూడా స్థలం లేదు. ఎలాగో ఎక్కానా, అక్కడినుంచి తాపీగా కూర్చుని చుట్టు ముట్టించినవాళ్లు ఎక్కడిదాకా వెడతావనీ, ఎవరివనీ, ఒకటే ప్రశ్నల వర్షం. ఫలానాపత్రిక విలేఖరినని చెప్పాను. దాంతో అందుకున్నాడు. మీది ఒట్ఠి తుక్కుపత్రికనీ, అన్నీ అసత్యపువార్తలే అందిస్తుందనీ, అది కొనుక్కోవడం శుద్ధ డబ్బుదండగనీ, ఏమిటేమిటో...పక్కస్టేషనులో రైలాగితే దిగి, ఇంకో పెట్టెలో ఎక్కాను. చచ్చీచెడీ, ఆశ్రమంచేరి, స్వామిదర్శనం చేసుకొని నిజానిజాలు నిర్ణయించి వచ్చేస్తూంటే, స్వామివారు ఉండమని సంజ్ఞచేశారు. “ఆంధ్రులంటే నాకు గాఢమైన ప్రేమకలదు. వారికికూడ నా యందు అమిత ప్రేమ కలదని నాకు తెలుసు; యీ వార్తని మీ పత్రికద్వారా అశేష ప్రజానీకాని కందించు” అని ఆదేశించారు స్వామి. కౌమారస్వామి ఏమిటి నాముఖం! అరంగుళాల గడ్డంవుంటే. ఆ నిజాన్నే నే చెప్పానా, ఇక చూడండి-ఆ వచ్చిన వుత్తరాలకి లెక్క లేదు!

నే: బాగుందండోయ్. అయినా రోజూ యిలా ఒకళ్ళని గురించిన వార్తయిస్తూంటే పని సులభమేగా?

వి: అంత సులభంలో లేదండోయ్. విలేఖరి ఒకవిధంగా సర్వాంతర్యామి. ఇందుకల డందు లేడని సందేహమువలదు. ఏ సభలో చూసినా, ఏ కార్యక్రమంలో చూసినా, ఎవరికీ తెలియకుండా ఎక్కడ రహస్య సమావేశం జరుగుతున్నా ...అక్కడక్కడంతా వీడు ప్రత్యక్షమే.

నే: స్థానికంగానే కాకుండా అప్పటూ అప్పటూ రైలు ప్రయాణంకూడా చేస్తూనే వుంటారు, నా వూహాచిత్రమే నిజమై మీకు కబంధుడి చేతులూ, రాక్షసి చెవులూ-

వి: బాగా చెప్పారు. ఒకచోటే కూర్చుండి వార్తా పరంపర అందించవచ్చు. అవునా?

నే: మద్యపాన నిషేధ విషయంలో మీ పత్రిక చాలా ప్రశంసనీయమైన కృషి చేసిందట. దాల్లో మీరూ భాగం పంచుకుంటారా?

వి: నిస్సందేహంగానండీ. అలా అంటే ఒక సంగతి జ్ఞాపకం వస్తూంది...ఒకచోట దొంగ సారాయి కాస్తున్నారని తెలిసి ఎంతవరకూ నిజమో తెలుసుకుందుకు వెళ్ళాను. అది శుద్ధ నిజం కాని, అది తేల్చుకుందుకు నావళ్లు హూనం చేయించుకోవలసి వచ్చింది. అంచేత విలేఖరి బాట పూలబాట అని అనుకోకండి.

నే: సరే కాని, ఒక రోజులో మీ రేమేం చేస్తారో, చెప్పకలరా? శ్రమ అనుకోకండి.

వి: శ్రమేముందండీ టీ తాగుతూ, కబుర్లు చెప్పడం అంతహాయి యింకోటిలేదు...ఈ రోజు తీసుకుందాం. మీ యింటికి నాలుగవుతూంటే వచ్చానా? అంతక్రితం...కార్యక్రమం చెప్తా.

అసలు రాత్రి పన్నెండింటిదాకా పడుకోనే లేదు. వూళ్ళో సంబరాలు. రాత్రి అధికారనంది వూరేగింపు; వేలకి వేలుజనం వెడతారు. ఆ ఉత్సవాన్ని కన్నులారా చూసి రాద్దామని బయలుదేరాను. సరి, ఆ సందర్భంలో నే గుర్తించిన వింతలు అనేకం. అవన్నీ ఆదోరకం పత్రికలకే కాని దినపత్రికలకి అనవసరం... పన్నెండు దాటింది, యింటికొచ్చిపడుకున్నాను. మూడు గంటలైందో లేదో, బయిట కారు హారన్ వినిపించింది. లేచి చూద్దునుకదా, మా ఆఫీస్ వాన్-ఎడిటరు దగ్గిరనుంచి చీటీ పట్టుకొచ్చాడు. తెల్లారుజాము బండిలో ఫలానా ఘరానా వ్యక్తి వెళ్ళిపోతున్నాడనీ, వారి వీడ్కోలు సందేశాన్ని అందుకొమ్మనీ, దాని సారాంశం. త్వరగా తెలివి తెచ్చుకొని బయలుదేరాను. రైలుకి అప్పుడే టయిమయింది. నాలాంటివాళ్ళప్పుడే ఆయన్ని చుట్టుముట్టేశారు. నేను వారితో కలిశాను: "అందరికీ తలో సందేశం ఎందుకోయ్! అదే అందరూ రాసుకోండి." అనేసి ఆ మహాశయుడు వెళ్ళి కూర్చున్నాడు. తిరిగి వచ్చేసరికి, ఆరవుతోంది. సరే, ఆరున్నరకీ ఏడుకీ మధ్య ప్రఖ్యాత నటీమణి, విదేశాలు దర్శించివచ్చిన శ్రీమతితో ఇంటర్వ్యూకి నిశ్చయం చేసుకొన్నాను వెళ్ళక తప్పదుకదా?

నే: ఆ శ్రీమతితోటే! అదృష్టవంతులండీ!

వి: మీరు పొరపడుతున్నారు. మీరనుకునేటంత అదృష్టవంతమూ కాదు. సరదా కాదు. గుమ్మంలో కాలెట్టగానే, గూర్ఖావాడు...అమ్మలేరు అంటాడు. ఆవిడ పర్మిషనిచ్చినా వాడు మటుకు ఓపట్టాని వదలడు. ఎలాగో వెళ్ళాను. హాల్లోకూర్చున్నాను. గంటా గంటన్నరఅయింది ఆవిడ వచ్చేసరికి "క్షమించండి ఎక్సైజు ఆలస్యం అయింది" అంటూవచ్చారు ఆవిడ. నేను అడగదలుచుకున్న ప్రశ్నలడిగే అవకాశంకూడా యివ్వకుండా, విదేశాల్లో, స్త్రీలనీ, ప్రత్యేకించి తారామణులనీ, ఎలా పత్రికలు ఆదరించుతారో, మన దేశం అధోగతిరావడానికి పత్రికలెలా కారణాలో, ఏమేమిటో, చెప్పేశారావిడ. నాకు ఉక్కిరిబిక్కిరయి ఏమీ తోచలేదు. మీ విదేశయాత్రలనుగురించి, ఒక చిన్న వ్యాసం వ్రాయకూడదూ? అడిగాను. అది మీరే చెయ్యండి-నే చెప్తాను. తొమ్మిదిగంటలకి నాకో ఎంగేజిమెంటుంది. మరి వెళ్తాను. అంటూ డ్రైవరుని కేకేసి వెళ్ళిపోయింది. నేనూ చేసేదిలేక బయలుదేరాను. ఆఫీసు చేరేసరికి పదిన్నర. యీవాళకి యింకా ఏమున్నాయా అని చూశాను. ఓ కావలసినన్ని. మా ఆఫీసులో మొత్తం నలుగురం విలేఖరులమున్నా ఒక్కొక్కరికి పనిమాత్రం మేరు పర్వతంలా ఉంటుంది. ఈ నాగరికతాభివృద్ధి కాదుకాని, పత్రికలు డబ్బు చేసుకోడం మాట అలావుంచి, విలేఖరుల ప్రాణాలు పోతున్నాయి.

నే: అలా అనకండి. నాగరికతాభివద్ధి పత్రికల ఆర్థికవికాసమూ, మీ మీదేకదా ఆధారపడి ఉంటు. మీరెంత రసవంతమైన సంగతులు అందిస్తే, పత్రిక అంత రసవంతరం అవుతుంది.

వి: అవుననుకోండి. అయినా, మనుష్యుల అభిరుచులూ, విలువలూ, అతి శీఘ్రంగలెని మారిపోతున్నాయి. విమర్శాత్మకదృష్టి విపరీతంగా పెరిగిపోతోంది. మేం అందించిన వార్తలతో ఏదో సంతృప్తిపడక విమర్శలూ ప్రతివిమర్శలూ రేగత్తిస్తారు. చూడండి దారుణం, ఒక మహానుభావుడు మా వార్తలను తిరిగి తెలుగులోకి తర్జుమా

చెయ్యమన్నారు: మేమంటే అంతలోకువ!

నే: అలా అనకండి. లోకోభిన్నరుచి, అంటారుకదా. నాకేమో, ఆ భావంలో లేకుంటే అది వార్త అనిపించదు.

వి: అందరికీ అలా తోచదండీ; సరే, పన్నెండున్నరకి కార్మిక మహాసభలో మహా నాయకుని ఉపన్యాసం ఒకటుంది. అది విన్నేసి యింటికి పోదమే...సరి నాలుగ్గంటలకి గాని తిరిగి వస్తానన్నానుకదా? ఆ మహాసభలో ఉపన్యాసంలో రిపోర్టు చెయ్యవలసిందేంలేదు. కారణం, అదంతా మీ పత్రిక పోలసీకి విరుద్ధం. అది యథాతథంగా రిపోర్టు చెయ్యడం నా ఉద్యోగానికి కోరి ముప్పుతెచ్చుకోడమే. అందుకని త్వరగానే తెమిలిపోయింది. ఇంటికెళ్ళి భోజనాదులు ముగించాను. స్నేహితులొచ్చారు. కాస్సేపు బాతాకానీ, యితరపత్రికలపై విమర్శలూ ప్రతి విమర్శలు జరిగాయి మూడుదాటింది. ఇంటావిడ యిచ్చినకాఫీతాగి యిలావచ్చాను. చూశారా, యీనాటి దినచర్య, యిక్కడితో ముగిసిందని అనుకోకండి. అర్థాంతంగా ఏమొస్తుందో చెప్పలేం. ఎలాగుంది ఇదంతా విన్నాక?

నే: మహారాజులా వుంటుందండీ, మీకేం మీ టైంమీది. మీయిష్టం వచ్చింది రాస్తారు.

వి: సరిపోయిందండోయ్; తోచినట్టూ రాసేస్తే మాఒళ్ళు మాదికాదు. ఆ మధ్య ఆర్థిక సమితోద్యమకర్తలు దారికాసి వచ్చేపోయే రైళ్ళని ఆపి, దాల్లో ప్రయాణించే నాయకులను మూడోతరగతిలో ప్రయాణంచేస్తామని వాగ్దానం చెయ్యమనేవారు. నల్లజండాల ప్రదర్శనం చేసి నవ్విన నాకు తాళాధ్యయనం తప్పలేదు...

నే: అవును కాని, రోజురోజూ, వింతవార్తలు అందించే ఆనందం దక్కుతోందిగా?

వి: ఏమానందమో, అలా ఆనందంగావుండే విలేఖరులూ వున్నారు; అక్కడా అక్కడా విన్న వార్తల్ని నిశ్చింతగా రాసి అందిచేస్తారు. ఒకసారి ఏమయిందో తెలుసా? నాకెరుకగల వ్యక్తి ఒకడు ద్రాక్షారంనుంచి ఒకవార్తరాశాడు. ఒక ఆవు రెండుతలల దూడని యీనిందనీ, దూడా ఆవూ క్షేమంగా వున్నాయనీ ద్రాక్షారంనించే రాసినవార్త నిజం కాదని ఎలా అనుకోనూ? కార్యాలయానికి అందించాను. కొన్నిరోజుల తరువాత ఒక బుర్రమీసాల ఆసామీ మా కార్యాలయానికి వేంచేసాడు, ఫలానాతేదీ పత్రికలో ప్రకటించినవార్త శుద్ధ అబద్ధమనీ, తాను మనుష్యులనుపంపి ద్రాక్షారం అంతా వెతికించాననీ, ఆ తేదీనాడు ఆవుకి రెండుతలలదూడ కలగడం అలా వుంచి ఆ రోజున ఒక్క ఆవైనా యీనలేదనీ ఎడిటరుతో దెబ్బలాడుతున్నాడు. ఎడిటరు ప్రాణం విసిగి, నన్ను పిలిచి రెండు చీవాట్లువేసి, పొరపాటు సవరణ వెయ్యమన్నాడు. అప్పటి నుంచీ నాక్కొంచెం గాలివార్తలంటే భయమే.

నే: బాగుందండోయ్ మీ చిత్రవిచిత్ర అనుభవాలు వింటుంటే నాకూ ఓ పత్రికావిలేఖరి నవుదామని వుంది.

వి: సరిసరి. "తమ్ములనుమానం తలతిక్క" తీరాలంటే తప్పక అనండి. కష్టసుఖాలు అప్పుడే బాగా నాటుతాయి. మరి యిక వెళ్ళనా?

నే: మీతో మాట్లాడే అవకాశం కల్గించినందుకు సంతోషం.

వి: దానికేముంది లెండి. అందరినీ మేం ప్రశ్నలతో విసిగిస్తే, మీరు అమాత్రం కుతూహలం వుండదా మరి!

ఇదీ పత్రికా విలేఖరి దినచర్య. అతనిదినచర్యకీ తక్కిన మానవాళి దినచర్యకీ చాలా తేడా వుంది. ప్రముఖుల కదలికలనిబట్టీ, వాతావరపు మార్పులనుపట్టీ, గాలికోడిలా మారుతూ వుంటుందతని దినచర్య. ఈ రోజు వూపిరి సలపదు. మర్నాడు పూర్తినిద్దర. వారాంతంలో ఉప్పెనాలా ఎంగేజిమెంట్సు కుప్పతిప్పలు-అక్షణంలో పత్రికావిలేఖరి మానసికపరిస్థితి అనూహ్యం: చావలేను బతకలేను అని వాపోతాడు; అందమైన న్యూసు, ఆనందకరమైన బోనసు అందుకున్నప్పుడు ఇంతకు మించిన మంచి ఉద్యోగం లేదనుకొంటాడు. ప్రత్యేక విలేఖరి పని మరి బాగుంటుంది. పార్టీలూ, ప్రెస్ కాన్ఫరెన్సులూ, గోల్డ్ ఫ్లేక్ సిగరెట్లూ ఒకటేమిటి-ఆ కొద్దిక్షణాలూ, రాజభోగా లనుభవిస్తాడు, మన సచివుల పర్యటన కార్యక్రమంలాగ - పత్రికావిలేఖరి దినచర్య ఒక నిప్పుల సంరంభం.

(ఆలిండియా రేడియో ప్రసంగం)